క్లుప్తంగా

బీమా సాయం అందజేత


బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన కలిక నజీర్ (40) గుండెపోటుతో మరణించాడు. సచివాలయం కార్యదర్శి రాజేష్, ఉపసర్పంచ్ మమత, గ్రామ నాయకులు యకోబ్, యోబ్ చేతుల మీదుగా మృతుని భార్య షాహిదాకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగేశ్వరరావు, శ్రీరాములు, కాశీం పీరా పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రజిత సత్యప్రపూర్ణ

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్‌గా శనివారం రజిత సత్యప్రపూర్ణ బాధ్యతలు స్వీకరించారు. ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలు విధులు నిర్వహిస్తున్న రజిత సత్యప్రపూర్ణ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆమెకు అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యాపకులు కిశోర్, వీరన్న, శ్రీనివాసరెడ్డి, ఆనందరావు, శ్రీలత, నాగేశ్వరరెడ్డి, రామయ్య, మురళి, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలను ఆక్రమిస్తే కూల్చివేస్తాం

డోన్ : పట్టణంలో డ్రైనేజీలపై అక్రమ కట్టడాలను ఏమాత్రం ఉపేక్షించమని, కూల్చివేస్తా మని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. 8వ సచివాలయ పరిధిలో 12వ వార్డులో శనివారం కౌన్సిలర్ దినేష్‌గౌడ్, స్వర్ణలత, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల డ్రైనేజీలపై అక్రమ కట్టడాలను గుర్తించిన కమిషనర్ తక్షణమే కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్‌బాబు పాల్గొన్నారు.

ప్యాపిలి ఎస్‌ఐగా జగదీశ్వర్ రెడ్డి



ప్యాపిలి: ప్యాపిలి ఎస్‌ఐగా జగదీశ్వర్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన రాజ్‌కుమార్ సీఐగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. నంద్యాల స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చిన జగదీశ్వర్ రెడ్డి ఈ మేరకు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

వైభవంగా చౌడేశ్వరిమాత విగ్రహ ప్రతిష్ట

బేతంచెర్ల: పట్టణ సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరి మాత ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ట శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు హుసేన్ రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, హుసేన్ రెడ్డి, పోలూరు వెంకటేశ్వర్ రెడ్డి, మధు మోహన్‌రెడ్డి, రఘు రామిరెడ్డి, ఉస్నం శేఖర్, రామస్వామి, నాగ మోహన్, భజన కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులోని మోడల్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న రమాదేవికి పదోన్నతి కల్పించి ప్రిన్సిపాల్‌గా ఇక్కడికి బదిలీ చేయడంతో ఆమె విధుల్లో చేరింది. నూతన ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు


ఇళ్ల పట్టాలను అందజేసిన దృశ్యం

సంజామల: గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బత్తుల రామచంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గిద్దలూరు గ్రామ సచివాయంలో జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందజేశారు. బత్తుల రామచంద్ర రెడ్డి మాట్లడుతూ గ్రామాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు.రూ.60 లక్షలతో నిమ్మచెట్లవాగు కల్వర్టు పూర్తి చేసిన ఘనత వైస్సార్‌సీపీ ప్రభుత్వం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీపీ ఆదిలక్ష్మి, నాయకులు సభాన్ వలి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో నైతిక విలువలు

ప్యాపిలి: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందటంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ కర్నూలు, నంద్యాల జిల్లాల సెక్రెటరీ తూర్పు లింగారెడ్డి తెలిపారు. శనివారం హెచ్‌ఎం పద్మాబాయి అధ్యక్షతన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు స్కౌట్స్‌పై అవగాహన కల్పించి చేరేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెల్లూరప్ప, మోహన్‌రావు, రామాంజనేయులు, రమేశ్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

నందివర్గం కళకళ !

- ప్రభుత్వ కార్యాలయాలతో గ్రామానికి పట్టణ శోభ
- తీరిన ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్యలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




రూ.24లక్షలతో నిర్మించిన వైఎస్సార్‌హెల్త్ క్లినిక్


రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు


రూ.24లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం

బనగానపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాలు కళకళలాడుతున్నాయి. పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుంది. పట్టణాలతో సమానంగా మౌలిక వసతులు చేకూరడంతో గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో మండల పరిధిలోని నందివర్గం గ్రామం ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో కళకళలాడుతుంది. దాదాపు 5వేల జనాభా కలిగిన నందివర్గం అభివృద్ధికి మారుపేరుగా నిలిచింది. గత ప్రభుత్వంలో కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ చిన్నపని జరగాలన్న 15 కిలోమీటర్ల దూరంలోని బనగానపల్లెకు వెళ్లాల్సివచ్చేది. గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రం భవనాలు వెలిశాయి. తాగు నీటి సమస్య పరిష్కారానికి లక్ష లీటర్ల కెపాసిటీ కలిగిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ఏర్పాటుతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. గతంలో ఏ చిన్న వ్యాధి సోకినా బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిందే. నేడు గ్రామంలో ఏర్పాటు చేసి వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ద్వారా స్వగ్రామంలోనే వైద్య సేవలు అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆర్బీకే సేవలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి నందివర్గం నుంచి సుబ్బరాయుని కొత్తూరులో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి రహదారి సరిగ్గా లేకపోవడంతో భక్తులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యా రు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రోడ్డు ఏర్పాటుకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు బీటీ రోడ్డు నిర్మించడంతో ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్య తీరింది. సుబ్రమణ్యేశ్వర స్వామి భక్తులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనుల వివరాలు

- రూ.1.80 కోట్లతో నందివర్గం నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణం
- రూ.44లక్షలు వెచ్చించి సచివాలయ భవనం
- రూ.24 లక్షలతో రైతుభరోసా కేంద్రం భవన నిర్మాణం
- రూ.24లక్షలతో వైఎస్సార్‌హెల్త్ క్లినిక్
- రూ.11లక్షలతో అంగన్‌వాడీ భవనం
- రూ.65లక్షలతో సీసీ రోడ్లు
- రూ.40లక్షలతో జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి
- రూ.15లక్షలతో ఎంపీపీ పాఠశాల అభివృద్ధి
- రూ.40లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం

మౌలిక వసతులు చేకూరాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా గ్రామానికి మౌలిక వసతులు చేకూరాయి. ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతోనే గ్రామం అభివృద్ధి చెందింది. ప్రత్యేకించి ముస్లిం శ్మశానవాటిను అభివృద్ధి పరచడం సంతోషకరం. ఏళ్లతరబడి నెలకొన్న రహదారుల సమస్యలు తీరాయి. మా గ్రామం పట్టణానికి దీటుగా మారింది. ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం.

– అల్లావుద్దిన్, నందివర్గం

ఊహించని అభివృద్ధి



గ్రామంలో గతంలో ఎన్నడూ జర గని అభివృద్ధి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరిగింది. మా గ్రామంలో ఎక్కువగా చేనేత కార్మికులు ఉన్నారు. వీరికి సుమారు రూ. కోటి మేర ముద్రా రుణాలు మంజురయ్యాయి. అలాగే చేతనే కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాది సీఎం వైఎస్ జగన్ రూ.24 వేలను ఉచితం ఇవ్వడం జరిగింది.

– ఎం నారాయణ, ఎంపీటీసీ సభ్యులు నందివర్గం

ఎమ్మెల్యే సహకారంతో సమస్యలు తీరాయి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామంలో నెలకొన్న దాదాపు అన్ని సమస్యలు తీరాయి. ప్రత్యేకించి అన్ని ప్రభుత్వ కార్యాయాల ఏర్పాటుతో ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన తిప్పలు తప్పాయి. నా హయాంలో గ్రామం అభివృద్ధి చెందడం సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే కాటసానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– వీ లక్ష్మీదేవి, సర్పంచ్ నందివర్గం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం అందజేసిన సహకారాన్ని గుర్తు చేస్తూ మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు ప్రకటించడంపై కాటసాని సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రెండు ఏళ్లు కారోనా కారణంగా పనులు నిలిచి ఇబ్బందులు పడ్డామని, కేవలం మూడేళ్ల పాలనలోనే సీఎం సహకారంతో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి చేయడంలో జిల్లాలోనే రెండవ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ఉచిత యోగాశిక్షణ తరగతులు

డోన్ : రైల్వేస్టేషన్ రోడ్డులోని క్లబ్ హౌస్‌లో ఈనెల 17వ తేదీ ఆదివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గీతాయోగాసన సంఘం అధ్యక్షులు గురూజీ రాంపుల్లయ్య, ప్రముఖ న్యాయవాది నాగ భూషణంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక, శారీరక ఆరోగ్యం, మానసిక వికాసానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యోగా గురువు సుధాకర్‌జీ ఈ తరగతులను నిర్వహిస్తారని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కళ్యాణ మండపం ప్రారంభం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని కొండపై వెలసిన తిరుమలవీరాంజనేయ స్వామి దేవాలయంలో నూత నంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ఆధ్యాత్మిక గురువులు జ్ఞానమహారాజ్, గండ్లూరి దత్తాత్రేయశర్మ, సురేంద్రకుమార్ మహారాజ్ ప్రారంభిస్తున్నట్లు శ్రీమాణిక్ ప్రభు సేవా సమితి సభ్యులు ప్రకట నలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి శ్రీతిరుమ ల వీరాంజనేయస్వామి గిరి ప్రదక్షిణ మార్గం, కల్యాణ మండపం ప్రారంభోత్సవం, సీతారామలు కల్యాణోత్సవం, 10 గంటల నుంచి జ్ఞాన మహారాజ్ చే అను గ్రహ భూషణం కార్యక్రమాలు సాగుతాయన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజేష్

డోన్ : మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని, పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను దశల వారీగా ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. కమిషనర్ డాక్టర్ జయరాంతో కలిసి స్థానిక ప్రభుత్వ ఐటిఐ నుంచి కొత్తబస్టాండ్ వరకు రూ.45 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో క్లీన్ అండ్ గ్రీన్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు మంత్రి బుగ్గన సహకారంతో ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వంశి, కుమ్మరి రాజు, కాలేషా, కుళ్లాయి, షేక్షావలి, పెద్దయ్య, డీఈ రసూల్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామానికి చెందిన పిక్కిలి ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు రూ.3 లక్షల చెక్కు మంజూరు కావడంతో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ తిమ్మయ్య చేతుల మీదుగా శనివారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, గ్రామ నాయకులు బుగ్గన కుమార్‌రెడ్డి, తిమ్మగురుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్షల ప్యాడ్స్ పంపిణీ


విద్యార్థినుల పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని ఎస్సీ,బీసీ బాలికల వసతిలో గృహంలోని పదవ తరగతి విద్యార్థినులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను శనివారం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ కంబగిరి పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థినులకు ప్రోత్సహక బహుమహులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్లు ముంతాజ్, విద్యావతి తదితరులు ఉన్నారు.

పది విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు అందజేత

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు దాతలు చేయూత అందిస్తున్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ యువనాయకుడు పేరం నందకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, లిటిల్ ఫ్లవర్‌కు చెందిన 150 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేశారు. అలాగే రామ్‌కో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు రూ.20వేలు విలువ చేసే ఎగ్జామ్ కిట్లను యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డి, రామ్‌కో ప్రెసిడెంట్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి


అమరజీవి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీరామవెంకట సుబ్రహ్మణ్యం, గాథంశెట్టివేనుగోపాల్, డాక్టర్ రవి కుమార్, నల్లగట్ల శివయ్య, నలగట్ల వెంకటేశ్వర్లు, నూకల విజయుడు, టంగుటూరి శీనయ్య, గుండా శ్రీనివాసులు, భరతుడు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్, కృష్ణశశాంక పాల్గొన్నారు.

డోన్ టౌన్ : పొట్టి శ్రీరాములు 124వ జయంతిని పురస్కరించుకొని ఆవోపా సంఘం సభ్యులు పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్లు, కొత్త బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి త్యాగాలను ఈ సందర్భంగా ఆవోపా సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు గుర్తు చేశారు. నాయకులు సుదర్శన్‌రావు, నాగరాజు, అంబికేశ్వర్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య గుప్త, రమణ, సురేంద్ర, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబాషిణి, ఇందుమతి ఆధ్వర్యంలో అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమరజీవి త్యాగాలను జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మద్దిలేటిస్వామి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కందగడ్డల మోహన్‌రావు గుర్తు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినంగా వ్యవహరిస్తామని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర హెచ్చరించారు. శనివారం రాత్రి రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలుగొట్ల గ్రామంలో సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌కుమార్, ఎస్‌ఐ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కోవెలకుంట్ల ఎస్‌ఐ వరప్రసాద్ అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌లో 28 కేసులు పరిష్కారం


బనగానపల్లెలో లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్


లోక్ అదాలత్‌లో కక్షిదారులను విచారిస్తున్న జడ్జి తంగమణి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 28 కేసులు పరిష్కరించిన్నట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఒక సివిల్ కేసు, రెండు భరణం కేసులు, ఒక చెక్ బోన్స్ కేసు, 13 క్రిమినల్ కేసులు, ఐదు ప్రిలిటిగేషన్ కేసులు, ఆరు ప్రిలిటికేషన్ కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మండ్ల రఘురామిరెడ్డి, న్యాయవాదులు తులసిశ్వరమ్మ, నరసింహారెడ్డి, విక్రం సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

డోన్ టౌన్ : స్థానిక కోర్టు భవన సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఇరు వర్గాల కక్షిదారులు రాజీ కావడంతో మొత్తం 151 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్స్‌పాల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ రెండు కోర్టులలో కలిపి మొత్తం 151 కేసులు పరిష్కరించారు. సబ్ కోర్టులో పీఎల్‌సీ కేసులు 18, ఓఎస్ 3, ఈపీలు 2 కేసులు పరిష్కారమవ్వగా, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీసీ 69, ఈసీ 41, ఈపీఎస్6, ఓఎస్9, డీవీసీ 1, ఎంసీ 2 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ హనీషా, న్యాయవాదులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

కోవెలకుంట్ల: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని కోవెలకుంట్ల జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ సూచించారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. 20 ఐపీసీ, నాలుగు ఓఎస్, రెండు ఎస్‌ఐయాక్ట్, ఒక ఎంసీ, ఐదు బ్యాంకులకు సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యకమంలో న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, తిరుపాలు, తిరుపతయ్య, రాజశేఖర్, ఓబులేసు, రమేష్, కాశీం పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్యాపిలి: ఈ నెల 18వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాలతో పాటు జలదుర్గం, రాచర్ల, పోతుదొడ్డి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శనివారం ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1105 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 30 వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పది విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

డోన్ టౌన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలురాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు పాస్ లేకున్నా హాల్ టిక్కెట్ చూపించి వెళ్లవచ్చన్నారు. విద్యార్థి ఉన్న ప్రదేశం నుంచి పరీక్షా కేంద్రం వరకు తిరిగి స్వస్థలానికి ఉచితంగా పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పరీక్షలు ఉన్న రోజులు మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతి ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

18న వాహనాల బహిరంగ వేలం

బనగానపల్లె : బనగానపల్లె సెబ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలకు ఈ నెల 18న బహిరంగ వేలాలు నిర్వహిస్తునట్లు సెబ్ స్టేషన్ సీఐ జోగేంద్ర తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించి ఈ వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు రూ.3వేల డిపాజిట్ చెల్లించి, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు కలిగి ఉండాలని సీఐ తెలిపారు.

వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మంజుల శ్రీనివాసులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మంజుల శ్రీనివాసులును వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల కర్నూలులో ఆ సంఘం ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కాటసానిని కలిసిన ఉపాధ్యాయులు


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్ : ఏపీ మోడల్ స్కూళ్ల రెగ్యులర్ సిబ్బందిని విద్యాశాఖలో విలీనం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడంతో బనగానపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని శనివారం ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్‌లో పని చేయు సిబ్బంది ఇప్పటి వరకు సొసైటీ కింద ఉండడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కమిషనరేట్ పరిధిలోకి రావడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామలక్ష్మీ, ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ వివరాల మేరకు చెవిటి బోయ మనోహర్ భార్య మాధవి (25) ఇంట్లో ఎవ్వరులేని సమయంలో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి మాధవిని కిందికి దించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. కుటుంబ కలహాలతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


టీడీపీ వర్గీయులపై కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్లలో ఇద్దరిని బెదిరించిన కేసులో టీడీపీ వర్గీయులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. రేవనూరు ఎస్‌ఐ రాంమోహన్‌రెడ్డి సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన దండె తిమ్మయ్యకు మంజూరైన ఇంటి పట్టా విషయంలో వలంటీర్ ఉసేన్‌తో లబ్ధిదారుడి బంధువు అయిన దండె వెంకటసుబ్బయ్య వాగ్వాదానికి దిగాడు. అక్కడే ఉన్న మధుసూదన్‌రెడ్డి, రాజేంద్రనాథ రెడ్డి గొడవ పడకుండా సర్దిచెప్పారు. అక్కడి నుంచి వారు ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గడ్డం నాగార్జునరెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రవీంద్రనాథరెడ్డి, కడియం ప్రసాదు, రామన్నగారి శేషు, గోనవరం సుధాకర్‌రెడ్డి, చిన్నవళి, దండె వెంకటసుబ్బయ్య కలిసికట్టుగా మధుసూదన్‌రెడ్డి, రాజేంద్రనాథరెడ్డిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడు మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఐదుగురు బైండోవర్

అవుకు: మండల కేంద్రానికి చెందిన 5 మందిని బైండోవర్ చేశామని ఎస్‌ఐ కిరణ్ బాబు శనివారం తెలిపారు. అవుకు పట్టణంలోని తేరు వద్ద రియాజ్, రవి క్రిష్ణ, సంజీవరాయుడు, హైమావతి, కె.రాజు గొడవ పడుతున్నారన్నారు. స్థానికులు సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని అవుకు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని తెలిపారు.

పేద విద్యార్థుల చదువులకు ఆర్డీటీ తోడ్పాటు


మాట్లాడుతున్న ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ రామేశ్వరి

ప్యాపిలి: పేద విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించడమే ఆర్డీటీ ధ్యేయం అని ఆ సంస్థ రీజనల్ డైరెక్టర్ రామేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో బోయినచెర్వుపల్లి, నేరేడుచెర్ల గ్రామాలకు చెందిన 107 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆర్డీటీ రిజనల్ డైరెక్టర్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డోన్ ఎస్ఎస్ కాలనీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తొగట సురేశ్ బాబు, ఆర్డీటీ ఏరియా టీం లీడర్ నాగభూషణం, ఎంఅండ్ ఇ కోఆర్డినేటర్ వెంకటేశ్, ఉపాధ్యాయులు గోపాల్, విజయలక్ష్మి, షకీలా, జీవలత, తులసమ్మ, లక్ష్మినాయక్, హరిత, మహేశ్వరమ్మ, శేషయ్య, వేణుగోపాల్ రెడ్డి, అశోక్, ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.